కథా నిలయం
6070
శ్రీకాకుళం



# ఆశ్రమవాసి

మధుసూదనశర్మ గారి 'నైమిశ' కుటీరం వూరికి మైలు దూరంలో వుంది.

ఊరిలో శర్మగారి స్నేహితులైన వర్షీయాంసులూ - శిష్యప్రాయులైన నవయువకులూ మధ్యాహ్నం మూడు గంటలు - ఆ ప్రాంతానికి 'నైమిశం'లో చేరి అనేక విషయాల మీద వేడివేడి చర్చలు సాగిస్తూ వుంటారు.

సాహిత్యం - సమాజం - కళ - వేదాన్తం ఒకటేమిటి సమస్తం ఆ చిన్న పెంకుటింటి పాలగచ్చు సావిడి తుంగచాపల మీద అలా అలా వికసించి గిరగిర తిరిగి ఎగిరిపోతుంటాయి.

సుమారు మూడు అవుతుంది. కొంచెం మబ్బు - చినుకుగా వుండడాన్ని ప్రస్తుతం 'నైమిశా'నికి అట్టే 'డిమాండు' లేకపోయినా - గోపాలం మాత్రం 'నైమిశం' ప్రశాంత హృదయాన్ని చెదరగొడుతూ అందుకున్నాడు.

"నేర్చుకుపోయారోయ్ - మీరూ - మీ ప్రేమ దాహాలూ - విరహ కావ్యాలూ - నీలి మబ్బులూనూ.

ఈరోజుల్లో ప్రతివాడూ - ప్రేమ తిని ప్రణయం తాగుతూన్నట్టు ఉపన్యాసాలు పేలగొట్టేవాడే -

నేనెరుగుదునుగా - ఏ శాంతాఏప్టియో మాయా బెనర్జీయో - పూలదండలతో కైదండలిస్తే శృంగార ఖంగారుతో అంగీకరించాలని మీ ముతావారి సంకల్పం -

చౌదరీ! ఒక్కటి చెబుతాను విను - పెద్దలు ఏర్పరచిన వివాహ సంస్థ బహు దొడ్డది - పెండ్లి విషయంలో - చక్కని సాంప్రదాయం చూసుకోవాలి గాని ఎందుకోయ్ - ఈ చదువుకొన్న చిత్రాంగులూ - ప్రేమ పెళ్లిళ్లూ - ఆకతాయి వేషాలూ - అవకతవక ప్రవర్తనలూ..."

"అపర శంకరాచార్లు గారూ! అక్కడ ఆగండి -" క్రిష్ణయ్య చౌదరి దెబ్బతిన్న తాచులా

0.40



తిరగబడ్డాడు.

"గోపీ! నీ చూపులో ఏదో గాఢమైన మాలిన్యం ప్రవేశించిందోయ్ -- లేకపోతే మధురమైన మానవ హృదయాన్ని - మృదులమైన స్త్రీజాతినీ ఇంత చులకన చేసి మాట్లాడవు - వేద విజ్ఞానాన్ని - ఉపనిషదౌదార్యాన్ని పోగొట్టుకుని, నీచ బుద్ధులతో పతితమైన బ్రాహ్మణజాతి 'అహం' అంతా నీలో పేరుకున్నట్టు కనబడుతోంది.

పవిత్రమైన వేదమంత్రాల కర్థం మరిచిపోయి మేజువాణీలకూ - వియ్యపురాలి లాంఛనాలకు తగవులాడిననాడే నీ వివాహ సంస్థ శిథిలమైపోయింది. పిల్లల శ్రేయస్సు మరిచి - పెండ్లి అంటే - వర విక్రయం - కన్యాశుల్కాల వేలం పాటగా మారిన వేళనే నీ పెద్దలూ - ఎద్దులూ - సమానం అని తేలింది.

ఈ విషమ సమస్యాకాలంలో - యువతీ యువకులు - తమ విచక్షణ ఉపయోగించి తమ రుచులకూ - లక్ష్యాలకూ తగిన వారిని తామే చూసుకోక ఏంచేస్తారు?

నాతరం, నాకు వరప్రసాదంగా ఇచ్చే నవ్య జాగృతిని - ఆత్మవికాసాన్ని - వద్దని నేను కళ్లు మూసుకోలేను.

ఎన్ని విదేశ కావ్య మాధుర్యాలు - ఎన్ని 'నవంనవ' శిల్ప సౌందర్యాలు - ఎన్ని అభినవ దివ్యసందేశాలు - నన్ను కొత్త వెలుతురులోకి గెంటివేసినవో నువ్వు గ్రహించ గలవా! -

మనిద్దరం బాల్య స్నేహితులమైనా - మానవ జీవితంలో ప్రవేశించడంతోనే నీదో తోవా - నాదోతోవా అయింది.

నీకు - సంఘం, లౌక్యం - ఉద్యోగం, పిల్లలు, మర్యాద, వీటి చాటున భార్య ఒక ఉపకరణం. ఎంత మూర్ఖురాలైతే - అంత మంచిది. అప్పుడు సమాజంలో నువ్వు 'బాగు పడ్డవాడవు'

నాకు - నా జీవిత వీణ మీద సుఖశ్రుతిలో, ఒక తియ్యని పాటగా- కదలి నృత్యం చెయ్యగలిగిన సుహాసిని, సహవాసిని కావలెనని కన్ను చింపుకొని వెదకుతున్నాను. కాని నీవలె హృదయంలేని, రంగు 'సెల్యులాయిడ్' బొమ్మలను చూచి భ్రమపడుతున్నానను కోకు - నా హృదయాన్నంతటినీ ప్రేమమయం చేసి - నా పూజామందిరంలో - హృద యాధి దేవత - మంగళమయి - అయిన స్త్రీమధుమూర్తిని పూజచేస్తాను, గాని నీవలె సంఘం ఇచ్చిన కొయ్యబొమ్మను చచ్చినా ప్రేమించలేను -

శరత్కాలపు వెన్నెల్లో మిలమిల మెరిసే లేత చిగుళ్ల వంటి నా ప్రియురాలి ఎర్రని పెదవులు - చెంపల మీదనుంచి మెడ వంపులోకి ప్రవహించే ఆమె లావణ్య కాంతి

కంటె నాకింకో ఉపాస్యదేవత లేదు. వట్టి శాక్తేయ మతస్థుణ్ణి, స్త్రీతి నామాపి మధురమ్ అన్న ముసలివాడు ఎంత బుద్ధిమంతుడోయ్ -

ఈ బలవన్నిశ్చయంలో - నాకు నువ్వూ - నీ సమాజమూ...

"బాలతృణవత్ - ఔనా?" శర్మగారు లోపల నుంచి నవ్వుతూ వచ్చి నిలుచున్నారు. చౌదరి చలాకిగా "మా గరం గరమ్ ప్రసంగాన్ని నాటకంగా మార్చి ఖుషీగా రక్తికట్టించిన తమ సన్నిధి మాకు ప్రసాదించాలి" అన్నాడు.

"మా వాదానికి మాధ్యస్థ్యం వహించి న్యాయం ఇప్పించాలి - ఇలా దయచెయ్యండి" అన్నాడు ఆహ్వానిస్తూ గోపాలం.

2

మధుసూదనశర్మ గారు వెనక విజయనగర ప్రాంతంలో వున్న ఒక కళింగ జమీందారిలో ఠాణేదారుపని చేసి, అంపపు కోతల వంటి సంసార భాగాలను అనుభవించి - జీవితంలోని చేదు పానీయాలనన్నిటినీ చవిచూచి, విసిగి -పింఛను పుచ్చుకున్నారు. వూరికి దూరంగా వున్న తమ మామిడి తోటలో 'నైమిశ'మనే పేరుతో ఒక పెంకుటిల్లు వేసుకుని అందులో ముసలి భార్యా తానూ ప్రస్తుతం నిశ్చలమైన వానప్రస్థాశ్రమాన్ని నడుపుతున్నారాయన.

బ్రహ్మసూత్రములను - గీతా భాష్యమును - దశోపనిషత్తులను - వివేకానందాదుల దివ్య సందేశాలను - తరచి చదివి లోతులు గ్రహించి ఆచరణకు తెచ్చిన పక్వ హృదయుడు.

దూరానికి ఆరముగ్గిన బౌద్ధసన్యాసిలా కనపడతారు.

వృద్ధులతోనూ - యువకులతోనూ సాయిలాఫాయిలాగా మాట్లాడి అందరినీ రంజించే ప్రేమమూర్తి.

ఏ విషయాన్నైనా ఎత్తుకుని వివేకంతో చర్చ చేస్తూ వుంటే వేదకాలపు ఋషుల ఔదార్యం జ్ఞాపకం వస్తుంది.

3

శర్మగారు గంభీరములైన తన కళ్లనెత్తి మానవ జీవితాల వెనుక వుండే ఏ నిగూఢ రహస్యాలనో చూస్తూ - 'ఈషత్' నవ్వి ఇట్లా వారి ప్రసంగంలో పాలుకొన్నారు.

"నాయనా, వేడి పాలవలె పొంగులువారే పడుచు హృదయాలలోని - తీవ్ర వాసనలనూ - ఆత్మాభిమానాలను ... అర్థం చేసుకోగలను. కాని -

ప్రపంచంలో నిరంతరమూ ఎగిరే - అసూయా - ద్వేష స్వార్థ ధూళులు మీ

హృదయాలలోని నిర్మలత్వాన్ని మాపి - కుటిలములుగా చేస్తున్నాయి. ఫలితంగా కొందరు వట్టి మితవాదులూ - కొందరు శుష్క అతివాదులూ - అవుతున్నారు.

ఒకవైపు చూస్తే - వేదర్షులు స్వచ్ఛ హృదయాలతో ఏర్పరచిన వివాహ మంగళవిధి బుద్ధిహీన శ్రోతియుల వల్ల ఖిలమైపోయింది. మడిబట్టలూ - దేవతార్చన పెట్టెలూ దొంగ స్నానాలూ - చాటున జరిగే ఘోరాలకు అంతు లేదు.

రెండవ ప్రక్కను చూస్తే - పరదేశ నాగరికతా ప్రభావాల వల్ల - ప్రేమకూ మోహానికీ భేదం తెలియని అజ్ఞానులు ప్రబలిపోతున్నారు.

బుద్ధిమంతుడు అందని తీవ్ర కాంక్షలకోసం ఆత్మవినాశాన్ని చేసుకోక జీవితాన్ని నిగ్రహంతో బిగబట్టి ఎన్నో ఉత్కృష్ట కార్యాలకు వినియోగించి వేస్తాడు.

నాయనా, ఈ జీవనయాత్రలో - ఎన్ని ఆశాభంగాలు - ఎన్ని కాల్చే ప్రతీక్షలు - ఎన్ని అశాంతులు -

ప్రేమ ముందు శరిస్తుంది - ఏడిపిస్తుంది - తహతహపడిన కొద్దీ దూరంగా జరిగి పోతుంది. ఒకనాడు హఠాత్తుగా ఎదురుచూడని త్రోవవెంట వచ్చి నీ భుజంమీద చెయ్యి వేస్తుంది.

ఇప్పుడు నేనీ అరవై ఏండ్ల వృద్ధ శరీరంలోనుంచి నా పడుచుప్రాయపు పొలిమేరల్లో ప్రవేశిస్తే ఆనాటి హృదయ స్పందన సన్నివేశాలు కొన్ని జ్ఞాపకం వస్తున్నాయి".

పాపం, ఆ వృద్ధుని ముడతలు పడ్డ కళ్ళనుంచి రెండు మంచి ముత్యాలు జారి చెక్కిళ్లమీద కరిగిపోయాయి.

శర్మగారు గొంతు సవరించుకుని చెప్పడం మొదలుపెట్టారు.

4

నేను విజయనగరం కాలేజీలో చదువుకొంటూండగా - ఎవరో మాకు దూరపు బంధువులు - జగన్నాథ యాత్రకు వెడుతూ - ఒకసారి మా కుటుంబాన్ని చూచి వెళ్ళ వలెనని దిగి మా యింటికి వచ్చారు. అప్పుడు నాకు పద్దెనిమిది - ఇరవై ఏళ్లు వుండ వచ్చు.

మా నాయనగారు వారిని చాలా ఆదరించి ఒక్క వారం రోజులు బలవంతం మీద మా ఇంట్లో ఆపివేశారు.

వచ్చినవారిలో పదిహేనేండ్ల ఒక అమ్మాయి కూడా వుంది.

ఆమె మా యింట్లో ప్రవేశించింది మొదలు అందరితో చనువుగా - నవ్వుతూ పాడుతూ గాలికన్నా తొందరగా - లేడికన్న అందంగా మసలడం ప్రారంభించింది.

ఎవ్వరితోనూ కొత్తలేదు - నవ్వులబండి - పువ్వులగుత్తి.

ఒకనాడు నేను నా 'స్టడీరూమ్'లో కూచుని ఏదో 'నోట్సు' వ్రాసుకుంటూ వుండగా - ఆమె ఓరగా మూసివున్న నా గది తలుపు తోసుకువచ్చి - చట్టున నన్ను చూచి సిగ్గుతో తిరిగిపోతూ - 'దొరగారి ఆఫీసు గాబోలు' (నేను ఖర్మంచాలక 'సూటు'తో వున్నాను) అంటూ గొణుక్కుని నవ్వుతూ గది గుమ్మం దాటుతూ వుండగా - వాళ్లలో వచ్చిన ఒక ముసలావిడ చూచి "సీతా, ఏమిటా వెకవెక? నీ బతుక్కి సాయం - తల తగలేయించరా అంటే నీ తండ్రి వినడు ... అనుభవిస్తాడులే" రంజుకుని వెళ్లింది.

నేను అప్పారావు పంతులుగారి శిష్యుణ్ణి. ఆ గురుదేవుడిచ్చిన కొత్తకళ్లతో అప్పుడే ప్రపంచాన్ని చూడడం ప్రారంభించినవాణ్ణి.

వెంటనే ఆ మాటలు నా కపాలాన్ని బద్దలుకొట్టి - మెదటిలో గుచ్చుకున్నాయి. పక్క గదిలో వెక్కివెక్కి ఏడుస్తున్న మూలుగు వినపడింది.

నేనంతవరకూ - దురదృష్ట దేవత జడలోని ఆ సుందర పుష్పాన్ని తేరిచూడనే లేదు.

అప్పుడామెను హృదయంలోకి తీసుకుని ఆదరించవలెనని ఎంతో తపించాను - మర్నాడు వారు బయలుదేరి వెళ్లిపోయారు. ప్రయాణ సమయంలో సీత అందరితోనూ చెప్పి బండి ఎక్కుతూ నీలి గోరింట పూలవంటి కళ్ళనెత్తి ఒక్కసారి నావైపు చూచి ముఖం అటు తిప్పుకుని వెళ్లిపోయింది.

నా గదిలో - మా గురుదేవుడు పలికిన 'ప్రేమ కలుగక బ్రతుకు చీకటి' అనే వాక్యం కాళ్లు వచ్చి పచారు చెయ్యడం మొదలెట్టింది.

ఇది దుర్లభజనానురాగమనీ - ఈ జన్మ మధ్యంలో ఇంక సీత నాకు కనపడదనీ గ్రహించలేనంత మూర్ఖుణ్ణి గాను - కాని యువక హృదయాలను నులిచి తనవైపు లాక్కునే ఏదో ప్రబల శక్తి నన్ను ఉన్మత్తుణ్ణి చేసింది.

తర్వాత కొన్నాళ్లకు నాకు పెండ్లీ - అయింది, పిల్లలూ - పుట్టారు. సంసార చక్రంలో తలవంచుకుని పరిభ్రమించడమూ మొదలుపెట్టాను. కాని -

ఆ సీత కోమల విగ్రహం మాత్రం చాలా రోజుల వరకూ నా కళ్లలోంచి జారిపోలేదు.

జీవిత - గాయాలనన్నింటినీ కాలమే మాన్పివెయ్యగలదు.

క్రమంగా నా నేత్రాలలోని సువర్ణ స్వప్నాలూ - నా మనస్సు లోతులలోని తియ్యని కోరికలూ - మాసిపోయాయి.

ఒక ఇంటివాడనై ఉద్యోగం చేస్తూ 'నిశ్చింత'గా కాలం గడిపివేస్తున్నాను. మరి కొన్నాళ్లకు ఇంకో చిత్రమైన అనుభవం.

5

ఒకసారి నా ఉద్యోగపు హయాం రోజుల్లో కొన్ని ముఖ్యమైన జమీందారీ వ్యవహారాలు పరిష్కరించుకోవడంకోసం ఒక పల్లెటూరు 'కమాను' వెళ్లాను. అక్కడ కొన్నాళ్లు మకాం చెయ్యవలసి వచ్చింది.

గ్రామ పెద్దలు నాకు వూరికి పక్కగా వున్న ఎలిమెంటరీ స్కూల్లో బస ఏర్పాటు చేశారు.

జన సంచారం తక్కువ - చుట్టూ రకరకాల చెట్లు - పూల మొక్కలు - చక్కని గాలి - నా వ్యవహారాలు చక్కబెట్టుకోవడానికి బహు సదుపాయంగా వుంది.

అక్కడ సుమారు నెల రోజులున్నాను. నా పనిగూడ సలక్షణంగా పూర్తి అయింది. తెల్లవారితే స్వగ్రామం వెళ్లిపోవడానికి ప్రయాణం పెట్టుకున్నాను.

పల్లెటూరి రైతు స్నేహితులు రాత్రి చాలావరకూ నాతో గడిపి, అంతా దండాలుపెట్టి వెళ్లిపోయారు. పన్నెండు గంటలు దాటుతుంది. పుష్యమాసపు వెన్నెల పుచ్చపువ్వులా వికసించి గ్రామసీమనంతటినీ వెలిగిస్తోంది.

నేను అప్పుడే గదిలోకి వెళ్లి పండుకున్నాను. బంట్రోతు వరండాలో పాత ఈతచాప మీద ఒరిగి అట్టేసేపు కాలేదు.

పెరట్లో మామిడి చెట్లకింద పండుటాకుల మీద పడుతూన్న ఏవో అడుగుల చప్పుడు పూర్తిగా నిద్రపోని నా చెవులకు తగిలింది. ఐదు నిమిషాలు గడిచాయి.

వరెండాలో ఏదో సన్నంగా తగ్గించిన గొంతులు వినపడుతున్నాయి.

బంట్రోతు మెల్లగా నా గదిలోకి వచ్చి వణుకు మాటలతో "బాబూ - యెవరో అమ్మ మీతో - మాటాడవలసిన... తొందర పని.. వుందట - అరుగుమీద వుండమన్నాను.. సెలవైతే.."

"వద్దు - వెళ్లు - నేనే వస్తు...న్నాను". నా తలలోంచి మెదడు జారిపోయి ఆచోట ఆశ్చర్యం నిండిపోతోంది.

నేను తూలుతూ వెళ్లాను - ఆమె నన్ను చూచి మెల్లగా అరుగు పక్కనుంచి పెరట్లోకి నడుస్తోంది సాభిప్రాయంగా -

తలలోని మల్లెచెండు నడిచే త్రోవను సువాసనతో నింపుతోంది -

స్త్రీజాతి మృదు హృదయాన్ని తిరస్కరించలేని దౌర్బల్యం వల్ల అనాలోచితంగానే ఆమెను అనుసరించాను.

వెళ్లి వెళ్లి ఒక మామిడి చెట్టు దగ్గిర తలవంచుకుని నిలుచుంది. నేను సమీపించాను.

"అమ్మాయీ, యెవరు నీవు? ఇంత రాత్రివేళ నాతో ఏమి .. పని వుంది? - "

ఆమెను స్పష్టంగా చూచాను స్వచ్ఛమయిన దంతపు బొమ్మ వంటి శరీరం - తెల్లని చీర - వెన్నెల కాంతిలోని ఆమె ముఖం నిర్మల మనస్సుతో తెల్లగలువలా మెరుస్తోంది.

నా తలలో తుఫాను పుట్టింది.

ఆ నవనీతమణి మాటలాడలేకపోయింది.

"చెప్పదగినంత పని ఏమీ లేకపోతే ... నేను వెళ్లవచ్చుననుకుంటాను" అతి కుతుకంతో బాధపడుతూనే అన్నాను.

"... ఈ సాహసానికి .. మన్నించండి - ఈ రాత్రి ... ఇలా వచ్చినందుకు ... నన్ను నీచంగా యెంచితే ప్రాణాలు వదిలించుకోవడం కన్న ఏమీ చెయ్యలేను" పాపం అభిమానంతో కుంగిపోయింది.

"ఫర్వాలేదు - అట్లా దిగులుపడడం దేనికి? నాతో నిర్భయంగా మాటాడవచ్చు" కొంచెం ఊపిరిపోశాను.

ఆమె తేరుకుంది -

"నేనొక గొప్పయింటి విశ్వబ్రాహ్మణుల కుటుంబానికి చెందినదాన్ని. తాతతండ్రులు బాగా చదువుకొన్నవారు. ఏం లాభం - కలిసిన సంబంధమని ఒక నిర్భాగ్యుడికి నన్ను చేశారు. అతడు దుస్సహవాసాలు మరిగి దేశాంతరాల పాలయిపోయాడు.

ఉన్నదీ లేనిదీ నేటివరకూ తెలియదు. నా బతుకు మంటగలిసిపోయింది. మావాళ్లకు చాకిరీచేస్తూ - తోచనప్పుడు ఏవో పుస్తకాలు చదువుకుంటూ ఇక్కడే పడివున్నాను.

ఈమధ్య ఎన్నోసార్లు మిమ్మల్ని చూశాను. మూర్ఛపోయిన నా కోరికలూ - ఆశలూ ఏవేవో మేలుకున్నట్టయింది.

మీ ప్రసన్నమైన ముఖం - చక్కని కళ్లూ - మీకు తెలియకుండానే నన్ను ఆకర్షించి వేశాయి. కులం - మర్యాద - కీర్తికోసం ఎంతో గిలగిల కొట్టుకున్నాను. లాభంలేకపోయింది. పండు వెన్నెల - నిండు యౌవనం - మీపాదాల దగ్గిరకు వచ్చిపడింది - అనుగ్రహించలేరూ?" శ్రావణ రాత్రిలో నీటి మేఘం చాటునుంచి ఒక్క వెన్నెల రేకలా నీళ్లు నిండిన కళ్లలోంచి సన్నంగా నవ్వి సిగ్గుతో తలవంచుకుంది -

ఆ శుభయామినిలో నా తనువొక్కసారి పులకరిల్లిపోయింది.

ఎన్ని అనంత తపస్సులకు - దురంత వేదనలకు - అనురాగ నిష్ఫలకు - సుదూర సుఖస్వప్నాలకూ ఫలితంగా - ఈ కమ్మని రాత్రి - ఈ అప్సరస్సౌందర్యం నాకు ఏ దేవతా వరప్రసాదంగా సిద్ధించిందో వూహించుకోలేకపోయాను. కాని... నా నోటివెంట

అప్రయత్నంగా ఈ మాటలు వచ్చాయి.

"నీవంటి ఉషస్సుందరి నన్ను మనఃపూర్తిగా ప్రేమించిందంటే నా ధన్యత్వం ఎంతని చెప్పగలను? నా ముప్పదేండ్ల బ్రతుకులోనూ ఇంత పర్వసమయం సంభవించలేదు. నిజం. కాని – పూర్వమే భార్యాపిల్లలూ – సంఘం – మర్యాద – వీటిచేత 'మాంసపు జైలు'లో బంధింపబడ్డ ఖైదీని నేను.

ఇంత అస్వతంత్ర పతితుడను నిన్ను ఎట్లా కన్నులకద్దుకొని ఆదరించగలను?

ఈ చక్కని వేళలో – మత్తులో – హాయిలో నీ సౌందర్యాన్ని – యౌవనాన్ని – కన్ను లు మూసుకొని అనుభవించి నా త్రోవవెంట నేను పోతే భవిష్యత్తులో – నీవు పడే నర కాగ్ని బాధను వూహించుకొని జాలితో కుంగిపోతున్నాను.

పురుషులు వట్టి వంచకులు – స్వార్థపరులు – ఎవ్వరినీ నమ్మకు – వెళ్లు – వెళ్లిపో – నీ వశమైతే – నన్ను దూరంగానే ప్రేమించు – పిచ్చిదానా! ప్రేమకు భౌతికస్పర్శ లక్కరలేదు. ఏ సుఖస్మృతిలోనైనా నిన్ను నేను తృప్తిగా తలచుకోగలను సుమా...

తిరిగి చూడకుండా నా బసలోకి నడిచిపోయాను.

మళ్లా చెట్లకింద పండుటాకుల్లో – విసురైన అడుగుల చప్పుడులోనుంచి 'ఛీ – మగ వాళ్లు ఎంత రాళ్ళు' అన్న మాటలు గాలిలో తేలివచ్చాయి.

వెంటనే బంట్రోతును సామాను సర్దమని చెప్పి తెల్లవారుజామునే ప్రయాణం సాగించాను.

వెచ్చని పొడుగైన నిట్టూర్పుతో శర్మగారన్నారు –

"నాయనా, జీవితాన్ని అనుభవపక్వం చేసి సత్యాన్ని గ్రహించండి – క్షుద్ర ప్రపంచ వాసనలకు లొంగక – తపస్సు చేసి ఉత్తమ లక్ష్యాలను సాధించండి – ఇప్పటికే చాలా ప్రొద్దుపోయింది. మాటమీద మాటగా ప్రసంగం పెరిగింది – ఇంక లేవండి – రేపు కలుసుకుందాం" శర్మగారు లోపలికి వెళ్ళిపోయారు.

'నైమిశం' మెట్లు దిగుతూ క్రిష్ణయ్య గోపాలం బుజం తట్టి "అతడనేక యుద్ధముల ఆరియు తేరిన వృద్ధమూర్తి" భైరవిలో సన్నంగా అందుకున్నాడు.

(1940 ఫిబ్రవరి - భారతి)